ప్రజాశక్తి

ఆదివారం 29 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బతుకు భయం

◆ హెటిరో రెండో పైపులైన్‌తో మత్స్యకారుల్లో ఆందోళన
◆ చేపల లభ్యతపై సంస్థకు అనుకూల నివేదిక
◆ వేట లేక పెరుగుతున్న వలసలు
◆ కలుషితమైన ఉప్పుటేరు, కంపుకొడుతున్న మత్స్యసంపద

హెటిరో వ్యర్థాల వల్ల కలుషితమవుతున్న ఉప్పుటేరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

జిల్లాలోని నక్కపల్లి హెటిరో డ్రగ్స్ కంపెనీ రెండో పైప్‌లైన్‌కు ప్రభుత్వాలు అనుమతులివ్వడంపై మత్స్యకారుల్లో అలజడి నెలకొంది. పుట్టి, పెరిగి బతుకుతున్న వూరిలో వుండనివ్వరా ? అని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'ప్రస్తుత పైప్‌లైన్‌లో హెటిరో విడిచిపెట్టిన వ్యర్థాలతో సముద్రంలో చేపలు దొరక్క, వలసెళ్లిపోతున్నాం. రెండో పైప్‌లైన్‌వేసి ఉన్న జనాలను కూడా వూర్లో వుండనివ్వరా ?' అని ప్రశ్నిస్తున్నారు. రెండో పైపులైన్‌కు అనుమతులివ్వొద్దని 2021 డిసెంబరు ఒకటి నుంచి రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం మిగతా 2లో..

రెండో పైప్‌లైన్ వేస్తే బతకలేం

కంపెనీ రాకముందు సముద్రం ఒడ్డునే ఎక్కువ సమయం గడిపేవాళ్లం. ఇప్పుడు వాసనకు భయపడి వెళ్లాలనిపించడంలేదు. మొదటి పైపులైన్ వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. ఇంకా రెండో పైప్‌లైన్ వస్తే బతకడమే కష్టం. గతంలో పైప్‌లైన్‌కు తగిలి దెబ్బతిన్న వలలకు కంపెనీ పరిహారం చెల్లించేది. ఇప్పుడు ఆ పరిహారమూ ఇవ్వడం మానేశారు. ఇంత నష్టపోతున్న గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కంపెనీ ముందుకు రావడంలేదు. విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంలేదు. రెండో పైపులైను అనుమతులు వెనక్కు తీసుకొనే వరకూ పోరాటం కొనసాగిస్తాం. పోరాటం తప్ప మరో మార్గం మత్స్యకారులకు లేదు.

మైలపల్లి మహేష్‌బాబు, 10 వార్డు మెంబరు, రాజయ్యపేట

శారదాపీఠం.. ఏమిటీ రాజకీయ పూనకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రజలను మరచి పాలన చేసే పాలకులుంటే.. మూర్ఖులు విజయాలు సాధిస్తారు' - అని ప్రపంచ ప్రఖ్యాత రచయిత ఫ్లాబర్ట్ చెప్పిన మాటలు, 'చిన్న చిన్న విషయాలు చిన్న మెదళ్లను ఆకర్షిస్తాయి' - అని బ్రిటిష్ నవలా రచయిత డొరిస్ లెస్సింగ్ చేసిన వ్యాఖ్యానాలు మన తెలుగు రాష్ట్రాల పాలకులకు, దేశాన్ని పాలించే పార్టీలకూ వర్తిస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. సాధారణ ప్రజానీకం సైతం 'ఎందుకీ మౌఢ్యం...ఎన్నాళ్ళీ! జాడ్యం' అన్న రీతిలో రాజకీయ నాయకుల వ్యవహారం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. విశాఖ జిల్లా చినముషిడివాడలోగల శారదాపీఠంపై పుట్టగొడుగుల్లా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్యంగా రాష్ట్రంలోని వైసిపి పెద్దలు వెళ్లి వాలిపోతున్నారు. ఈ వరసలో కొంతమంది బడా కాంట్రాక్టర్లు కూడా లేకపోలేదు. ప్రజా సమస్యలన్నిటినీ వదిలిపెట్టేసి మతాచారాలు, పూజలు, పునస్కారాలంటూ కాలం గడిపేయడమే పాలనా ?. ప్రజలు ఐదేళ్ల కోసం ఓట్లేసి గెలిపిస్తే ఈ రాజకీయ నాయకుల జీవితాలు సగం కాలం ఈ పీఠాలను సందర్శించడానికే సరిపోతోందంటే ఆశ్చర్యం ఏమీ కాదు.

పోటా పోటీ

శారదా పీఠాధిపతులు ఏటా నిర్వహించే వార్షిక ఉత్సవం రాజశ్యామల యాగం. దీని కోసం నేతలు, ఇతర ప్రముఖులు పోటీ పడి మరీ చినముషిడివాడకు వేలం వెర్రిగా క్యూ కడుతుంటారు. శనివారం జరిగిన ప్రత్యేక పూజల్లో పంజాబ్ గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్, ఎపి డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి రోజా ఇంకా చోటా మోటా వైసిపి నేతలంతా పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సిఎం కెసిఆర్ రావాల్సి ఉండగా చివరి నిమిషంలో వారి పర్యటనలు రద్దయ్యాయి. మరోపక్క ఉన్నతాధికారులూ శారదా పీఠానికి క్యూ కట్టారు. హరి జవహర్‌లాల్, గౌతమ్ సవాంగ్, తదితరులు వీరిలో ఉన్నారు. రాజకీయాల్లోనూ, బాధ్యతాయుత ఉద్యోగాల్లోనూ ఉన్న వీరంతా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడుగాకుండా... ఇలాంటి పీఠాలకు, దేవాలయాలకూ వెళ్లే సందర్భాల్లో చేసుకునే మీడియా ప్రచారంపై అభ్యంతరాలు నానాటికీ ప్రజానీకం నుంచి పెరుగుతున్నాయన్నది వీరి చెవులకు వినిపిస్తుందా ?. వీరి వ్యవహారం వల్ల మతోన్మాద బిజెపి మిగతా 2లో..

లోపలి పేజీల్లో..

ముగిసిన సాఫ్ట్ టిస్యూ లేజర్ వర్క్‌షాప్

నిలిచిన క్రషింగ్.. ఆగిన చెరుకు సరఫరా!

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే

90వ రోజుకు నాబ్ నిర్వాసితుల ఆందోళన

దీక్షా శిబిరంలో నినదిస్తున్న మహిళలు

స్టీల్ దీక్షల్లో మహిళలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రెండేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఉద్యమిస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోకపోవడం శోచనీయమని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే ఉండేలా కాపాడుకుంటామని వారు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 667వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. ఈ మిగతా 2లో..

ఉక్కు ప్రజా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

30న భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయండి

: అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు, తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 30వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో జరుగనున్న ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. జగదాంబలోని సిఐటియు కార్యాలయంలో శనివారం జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉక్కు ప్రజా గర్జన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని మోడీ ప్రకటించి ఈ నెల 27కి రెండేళ్లు పూర్తయిందని, నాటి నుంచి నేటి వరకూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. మోడీ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉక్కు ప్రజా గర్జన సభ జరుగుతుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని నినదిస్తూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు చూడటం దుర్మార్గమన్నారు. పెద్ద ఎత్తున సభలు, మానవహారాలు, సమ్మెలు, రాష్ట్ర బంద్‌లు నిర్వహించినా ప్రభుత్వం నిర్ణయాల్లో మార్పు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ మిగతా 2లో..

విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

పిఎంజె వివాహ ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రసిద్ధ ఆభరణాల బ్రాండ్ పిఎంజె జ్యూయలర్స్ వివాహ ఆభరణాల ప్రదర్శన శనివారం బీచ్ రోడ్డులోని నొవొటెల్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జివిఎంసి అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ వివాహ సీజన్‌లో ఇంత భారీ ఆభరణాల ప్రదర్శన వైజాగ్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిఎంజె సేకరించిన విశిష్ట ఆభరణాలు ఈ ప్రదర్శనలో వినియోగదారులను తప్పక ఆకర్షిస్తాయన్నారు. పిఎంజె జ్యూయలర్స్ వైజాగ్ హెడ్ ఆనంద్ జిలగం మాట్లాడుతూ ఈ భారీ ఆభరణాల ప్రదర్శనలో పది వేలకుపైగా వెడ్డింగ్ కలెక్షన్లు ఉన్నాయన్నారు.

పెరిగిన అవినీతితో ప్రజలకు నష్టం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో పెరిగిన అవినీతి కారణంగా ప్రజలు నష్టపోతున్నారని రాజ్యసభ ఎంపీ జివిఎల్.నరసింహారావు అన్నారు. టిడిపితో విసిగిపోయిన ప్రజలు వైసిపిని గెలిపిస్తే వారేం ఒరగబెట్టారని ఎద్దేవా చేశారు. శనివారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ విభాగం అధ్యక్షురాలు పారిజాత సత్పతి నేతృత్వంలో స్థానిక రైల్ క్లబ్‌లో యోగా, రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ 15 రోజులుగా యోగాసనాలు - సూర్య నమస్కారాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ముగింపు వేడుకకు హాజరైన పారిజాత సత్పతి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే డిఆర్‌ఎం అనుప్ సత్పతి మాట్లాడుతూ సూర్య నమస్కారాల నేపథ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు మనోజ్ కుమార్ సాహూ, సుధీర్ కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం చేపట్టారు. ఓం ఉచిత యోగా సెంటర్ వ్యవస్థాపకులు, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిలకా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్టీల్ విక్రేతల సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మొదటిసారిగా జాతీయ స్థాయిలో స్టీల్ అమ్మకపుదారులతో యాజమాన్యం సమావేశమైంది. ఉక్కునగరంలోని స్టీల్ క్లబ్ శనివారం దీనికి వైదికైంది. స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్, ఫైనాన్స్ డైరెక్టర్ వివి.వేణుగోపాలరావు, వాణిజ్య విభాగం డైరెక్టర్ మహంతి, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఎకె బగ్చి తదితరులు హాజరయ్యారు. దేశ నలుమూలల నుంచి సుమారు 200 మంది విక్రేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో విక్రేతలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, అలాంటివారిని అభినందించడం కోసమే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తయారీదారులు, వ్యాపారుల భాగస్వామ్యంతో వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని ఆయన అభినందించారు. విక్రేతదారులను ఉద్దేశించి కమర్షియల్ డైరెక్టర్ డికె.మహంతి మాట్లాడుతూ విక్రేతదారులు సహేతుకంగా టెండర్ కోడ్ చేయాలని, డెలివరీ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని సూచించారు. మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్‌పై భారత ప్రభుత్వ మార్గదర్శకాలను స్టీల్ ప్లాంట్ కచ్చితంగా అనుసరిస్తుందని తెలిపారు. మరింతమంది విక్రేతదారులను రిజిస్టర్ చేసుకోవడానికి స్టీల్‌ప్లాంట్ సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం 3845 మంది రిజిస్టర్ స్టీల్ అమ్మకపు వ్యాపారులు ఉన్నారని తెలిపారు.

ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలోని లిఫ్ట్, క్రెచ్‌ను సంస్థ సిఎమ్‌డి కె.సంతోషరావు శనివారం ప్రారంభించారు. లిఫ్ట్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని ఆయన అన్నారు. రూ.28 లక్షల వ్యయంతో లిఫ్ట్‌ను తక్కువ కాలంలో వినియోగంలోకి వచ్చేలా కృషి చేసిన సర్కిల్ ఎస్ఇ మహేంద్రనాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డాక్టర్ ఎవివి సూర్యప్రతాప్, చంద్రం, అనసూరి రాధిక, సిజిఎమ్ వి.విజయలలిత, ఎస్ఇ మహేంద్రనాథ్, జోన్-1 ఇఇ జి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

బతుకు భయం

మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. వీరంతా తమ జీవనోపాధిని దెబ్బతీసే కంపెనీ పైప్‌లైన్‌కు అనుమతులివ్వొద్దని ఏకోన్ముఖంగా చెబుతున్నారు. అయినా వారి విన్నపాలేవీ వినకుండా, వారి బతుకుదెరువుపై ఆలోచించకుండా ఏకపక్షంగా కంపెనీకి ఒక్కొక్క అనుమతులిచ్చుకుంటూ పోవడంతో ఊర్లో వుండలేమన్న భయం మత్స్యకారుల్లో అలముకుంది. కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాక సముద్ర ఒడ్డుకు సమీపంలో చేపలు దొరకని పరిస్థితి ఏర్పడింది. పైప్‌లైన్ నుంచి విడుదల చేసిన వ్యర్థాల వల్ల చేపలు దొరక్క సముద్రం లోలోపలకు మత్స్యకారులు వెళ్తున్నారు.

పడిపోయిన ఆదాయాలు

చేపలు దొరక్కపోవడంతో మత్స్యకారుల ఆదాయాలు పడిపోయాయి. రోజుకు ఒకసారి వేటకు వెళితే వారానికి రెండు, మూడు వేల రూపాయలు వచ్చే ఆదాయం, ఇప్పుడు రెండు సార్లు వేటకు వెళ్తున్నా వెయ్యి రూపాయలు కూడా రావడం లేదని మత్స్యకారులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. ఒక్కోసారి డీజిల్ డబ్బులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వేటలేక... ఆదాయంరాక కుటుంబాలను పోషించుకోలేని మత్స్యకారులు తమ కుటుంబాలను తీసుకొని వలస వెళ్లిపోతున్నారు. రాజయ్యపేటలో కంపెనీ రాకముందు 200 పడవులుండేవి. ఇప్పుడవి 110కి తగ్గాయి. అందులో 80 బోట్లను అమలాపురం, తూర్పుపాలు, వాసాలతిప్ప, యానాం, గచ్చకాయలపర, నీలరేవు, మచిలీపట్నం, నెల్లూరు, ఒడిశా, కోనార్క్, విశాఖపట్నం, పలాస, తుంగభద్ర, పారాదీప్, శ్రీశైలం డ్యామ్ ఇలా వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి చేపలు వేటాడుతున్నారు. సముద్రంలో చేపలు దొరక్క ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతుకుతుంటే, చేపల లభ్యత బాగుందని మత్స్యశాఖ ఎలా నివేదిక ఇచ్చిందని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. కంపెనీ పరిసరాల్లో సముద్రంలో చేపలు లేక, వలస వెళ్లలేక నిర్మాణ, వ్యవసాయ పనులకు వెళ్తున్నట్లు తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలావుంటే చేపల ఉత్పత్తి బాగుందని నివేదిక ఇవ్వడం.. కంపెనీకి మేలు చేసి, మత్స్యకారులకు కీడు చేయడానికేనని మత్స్యకారులు అంటున్నారు.

ఉప్పుటేరు వద్దా సమస్యే..

తుపాన్లు వచ్చినప్పుడు, సముద్రంలో వేట నిషేధ కాలంలోనూ, సముద్రంలో వేటాడే శక్తిలేని వాళ్లు, పిల్లలు పట్టించుకోని వయస్సు కలిగిన మత్స్యకారులకు ఒకప్పుడు పెద్ద ఆధారంగా ఉప్పుటేరు వుండేది. ఇప్పుడు దానిలో చేపల లభ్యత తగ్గి, వాసన రావడంతో పట్టిన చేపలు అమ్ముకొనేందుకు అనేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. కంపెనీ వచ్చాక తమ జీవనోపాధి పోయిందని మత్స్యకారులు ఆందోళన చెందుతుండగా, కంపెనీ ప్రతినిధి సుబ్బారెడ్డి మాత్రం వ్యర్థాలను శుద్ధిచేసి సముద్రంలోకి విడిచిపెడుతున్నామని చెప్పుకొచ్చారు.

పైప్‌లైన్ వేయొద్దు

ప్రజలకు హాని చేసే హెటిరో రెండో పైప్‌లైన్‌కు ప్రభుత్వాలు అనుమతులివ్వడం సరికాదు. మత్స్యకారుల బతుకులు పాడుచేయొద్దు. పైప్‌లైన్ వేయొద్దు. బలవంతంగా వేయాలని ప్రయత్నిస్తే కలిసికట్టుగా అడ్డుకుంటాం.

గోసల సోమేశ్వరరావు,
తెప్పల బోట్లు సంఘం అధ్యక్షుడు, రాజయ్యపేట

రాజయ్యపేట రేవు చేపలు కొనడంలేదు

హెటిరో కంపెనీ వదులుతున్న కలుషిత నీరు వల్ల సముద్రంలోనూ, ఉప్పుటేరులోనూ చేపలు దొరకడంలేదు. దొరికిన చేపలు వాసన కొట్టడంతో కొనడానికి ఎవరూ ముందుకురావడంలేదు. రాజయ్యపేట రేవంటేనే వెనక్కు తగ్గుతున్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్నాం. కంపెనీ నిర్మాణ కాలంలో ఇచ్చిన హామీలేవీ అమలుకాలేదు.

పిక్కి నాగరాజు, రాజయ్యపేట గ్రామ పూజారి

ఉన్న పైప్‌లైన్‌ను సర్దుబాటు చేసుకోవాలి

ప్రస్తుతమున్న పైప్‌లైన్‌తో సర్దుబాటు చేసుకోవాలి తప్ప కొత్తగా పైప్‌లైన్ వేయకూడదు. జనాలకు ఇబ్బందిలేకుండా వ్యర్థాలను శుద్ధిచేసి సముద్రంలోకి వదలాలి.

గోసల కాసులమ్మ,
జెడ్‌పిటిసి, నక్కపల్లి

శారదాపీఠం..
ఏమిటీ రాజకీయ పూనకం

ఇదే అవకాశంగా తమ అజెండాను ముందుకు తీసుకెళ్లదా ?. ఇప్పటికే కేంద్రంలోని మోడీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసే దిశగా విశాఖలో ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కాషాయ శక్తులు విశాఖ కేంద్రంగా రెచ్చిపోతూ జన ఆలోచనలను దారిమళ్లించే యత్నాలకు దిగుతున్నాయి. వీటన్నింటిపై జనంలో చైతన్యం కల్పించాల్సిందిపోయి పీఠాలు చుట్టూ నేతలు, అధికారులు తిరగడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొలిటికల్ పవర్ సెంటర్‌గా పీఠం

అసలు విషయానికొస్తే... శారదాపీఠం ఒక రాజకీయ అధికార కేంద్రంగా మారిపోయిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ప్రతిపక్షాలే కాదు... స్వపక్షమైన వైసిపి నేతల నుంచీ వినవస్తున్న మాట ఇది. రాష్ట్ర పార్టీ అధినేతను దర్శించుకోలేని బడా వ్యక్తులు, సంస్థలకు చెందిన వారు సైతం శారదాపీఠం ద్వారా రాజకీయం నడుపుతున్నారన్న వ్యాఖ్యలు తొలినుంచీ వినిపిస్తున్నాయి. భక్తితో ఏర్పాటు చేసుకున్న ఆశ్రమాలు, పీఠాలు, మఠాధిపతుల స్థావరాలు, శక్తి పీఠాలు దేశమంతటా ఉండడం తెలిసిందే. వాటి అక్రమ, అవినీతి, రాసలీలల భాగోతాలూ పలుసార్లు పత్రికల పతాక శీర్షికలకెక్కాయి. ఎపి, తెలంగాణలో తిరుమల తిరుపతి దేవస్థానం అంతటి ప్రాచుర్యం పొందిన 'పీఠం'గా విశాఖ శారదాపీఠం వెలసిందంటే అతిశయోక్తి కాజాలదు. ప్రభుత్వాలకు, మంత్రులకు, బడా కాంట్రాక్టర్లకు ఆశీర్వచనాలను అందజేయడం ద్వారా తమ ప్రాపకం నిలబెట్టుకునే క్రమంలో శారదాపీఠం నిలబడింది. తద్వారా ప్రభుభక్తిని చాటుకుంటూ అనేక రకాలుగా ముందుకెళ్లే పనిలో నిమగ్నమైంది.

ఉక్కు ప్రజా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

కార్పొరేషన్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని తెలిపారు. రెండేళ్ల నుంచి కార్మిక, ప్రజా సంఘాలు తమ శక్తి మేరకు పోరాడుతున్నాయన్నారు. ఇప్పుడు 'ఉక్కు ప్రజా గర్జన'కు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులందరినీ ఆహ్వానించామన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొనని వారు చరిత్ర హీనులుగా, దేశద్రోహులుగా మిగిలిపోతారని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు, వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై.మస్తానప్ప, హెచ్‌ఎంఎస్ జిల్లా నాయకులు దొమ్మేటి అప్పారావు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు కనకారావు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయినబాబు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ దీక్షల్లో మహిళలు

సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది బలిదానం, వేలాది ఎకరాల భూముల త్యాగంతో ఆనాడు స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందన్నారు. ఇంత చారిత్రక పోరాటంగల కర్మాగారాన్ని అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే మహిళలకు ఉద్యోగావకాశాలు ఉంటాయని, ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్ ఉండదని చెప్పారు. దీక్షల్లో కె.మణి, కె.కుమారి, బి.భారతి, వి.ప్రభావతి, కె.సంతోషం, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.No. 344/2019 in O.S.1530/2012
Between :
Sarvasiddi Ramanamma
... Decree Holder / Plaintiff
And:
Nammi Appalakonda and another
...Judgement Debtor / Respondents
AUCTION NOTICE
The public are hereby invited to participate in the public auction to be conducted on 24-02-2023 from 10-30 A.M. to 5 PM in the Hon'ble Court of the below schedule property belong to judgement debtor, in realization of amounts covered under the above said E.P.No. 344/2019 of the Decree Holder.
SCHEDULE
A RCC Slabbed house consisting of Ground and First Floor bearing D.No.59-24-17, situated at Gollaveedhi, Malkapuram, Visakhapatnam, with in the limits of Greater Visakhapatnam Municipale Corporation and SRO, Gajuwaka and bounded by :
East : Vurukuti Chinnammalu House
South : House of Nookaraju
West : House of Nammi Ramanamma
North : 12' feet wide road
Value of the Property :
Amin Value : Rs.18,00,000.00 ps
Decree Holders Value : Rs. 20,00,000.00 ps
E.P. Claim : Rs.11,54,520.00 ps
The Property is situated within the said boundaries
(By the Order of the Court)
N.HARANATH
Advocate for the Decree Holder
Visakhapatnam
Cell: 9490300790

మహారాజశ్రీ నర్సీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 85 / 2019
వాది: కొసనం అప్పారావు
ప్రతివాది: పీలా వెంకటలక్ష్మి
భర్త (లేటు) రామకృష్ణ, వయస్సు 44 సం॥లు, డో.నెం.25-163/1, కాపువీధి, నర్సీపట్నం గ్రామం & మండలం అనకాపల్లి జిల్లా.
జనరల్ నోటీసు
పై నెంబరు దావాలో యిందలి ప్రతివాదిపై ఒ.ఎస్.85/2019 పరిహారం నిమిత్తము పీలా వెంకటలక్ష్మిపైన, వాది అయిన కొసనం అప్పారావు వ్యాజ్యము నడుపుచున్నారు. కావున కోర్టు వారి ఆదేశానాసారము మీకు ఎన్నిసార్లు దావా సమనులు పంపించెనను, తీసుకోనందున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు నోటీసు పంపడమైనది. సదరు విషయములో మీకు ఎట్టి ఆక్షేపణలుయున్నను **తే:31-1-2023 ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి యెదుట స్వయంగా కాని, అడ్వకేటు ద్వారా గాని, హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనిచో సదరు విషయమై మీ పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురు అని ఈ నోటీసు మూలంగా తెలియపర్చడమైనది.
ఎం.ఎల్.శ్యామలరావు
అడ్వకేట్, నర్సీపట్నం
సెల్ : 9849251636
నర్సీపట్నం
తే:28-1-23

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
O.P.No. 16 / 2022
పిటిషనరు : వాసం బాల @ జోషప్
రెస్పాండెంట్లు: వాసం శాంతి మరి 1రు
నోటీసు
2వ రెస్పాండెంటు:
గొండేని ధనరెడ్డి,
తండ్రి (లేటు) మన్మధరావు
Raligion is not known పిటిషనరు,
వయస్సు 32 సం॥లు,
R/o. డో.నెం. 59/4-27, పల్లెవీధి, మల్కాపురం, గాజువాక, విశాఖపట్నం, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్కు సెక్షన్-1 (I) (i) నోటీసులు పంపిననూ పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు 2వ రెస్పాండెంట్ వాయిదా రోజున అనగా **తేది: 01-02-2023న ఉదయం 10-30 గంటలకు** శ్రీ కోర్టుకు హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై)
యల్లపు నాగేశ్వరరావు
అడ్వకేట్, యలమంచిలి
సెల్ : 9553383837
అనకాపల్లి
తే:28-1-23

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 1019/2022
Between :
State Bank of India, RACPC-1,
SAR Wing, A.O. Balaji Nagar,
Siripuram, Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff
And:
Pilla Ajitha and another
...Defendands
SUMMONS
To,
D-1: Pilla Ajitha,
D/o. Pilla Ranga Rao,
Hindu, aged 24 years,
R/at D.No.58-21-24/5, Baji Junction,
Backside of Bhashyam Public School, Visakhapatnam-530027.
D-2: Pilla Ranga Rao,
S/o. Appa Rao, Hindu,
aged 54 years, **Rest-do-**
Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **03-02-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **03-02-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate, Visakhapatnam.
Cell: 7396518669.

హైస్కూల్‌ను సందర్శించిన డైట్ బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ మాణిక్యంనాయుడు, మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, డైట్ లెక్చరర్ గొట్టేటి రవితో కూడిన జిల్లా పరిశీలన బృందం శనివారం సందర్శించింది. అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వారు పరిశీలించారు. ఎక్కువ తరగతులలో సిలబస్ సకాలంలో పూర్తిగా కాకపోవడాన్ని గుర్తించి ప్రశ్నించారు. ప్రాథమిక తరగతులలో వర్క్ బుక్స్ సకాలంలో విద్యార్థులు పూర్తి చేయకపోవడాన్ని, పిల్లల వర్క్‌బుక్స్‌ను సకాలంలో ఉపాధ్యాయులు పరిశీలించక పోవడానికి గుర్తించారు. దీనిపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం అమలు తీరులను పరిశీలించారు. రెండు నెలల నుంచి విద్యార్థుల స్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఉపాధ్యాయులందరూ టీచింగ్ నోట్స్ రాయడాన్ని గమనించి ప్రశంసించారు. పాఠశాలలో జరిగే అకడమిక్ కార్యక్రమాలన్నింటినీ ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు.

పదవ తరగతి విద్యార్థుల స్థాయిలను పరిశీలించారు. మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించారు.



గొట్టిపల్లి హైస్కూల్లో వర్క్‌బుక్‌లను పరిశీలిస్తున్న డైట్ బృందం

థైరాయిడ్‌తో కంటి వ్యాధులు

డాక్టర్ అఖిలా మల్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటికి వచ్చే వ్యాధులలో థైరాయిడ్ కూడా కారణం కావచ్చని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ జీఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణం ఆక్యులో ప్లాస్టీ కన్సల్టెంట్ డాక్టర్ అఖిలా మల్లు పేర్కొన్నారు. థైరాయిడ్ రుగ్మతతో బాధపడుతున్న వారికి ఆప్తో ఇమ్యూన్ అనే కంటి సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ వ్యాధి వచ్చే వారికి కళ్ళ పొడిబారడం, నీరు కారడం నుంచి నొప్పి, కంటి చుట్టూ ఉన్న టిష్యూల వాపు, కళ్లను మూయలేకపోవడం, కంటి కదలికలలో పరిమితి, దంద్వ దృష్టి, చూపు కోల్పోవడం

వంటివి ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయని పేర్కొన్నారు. థైరాయిడ్ వల్ల వచ్చే కంటి వ్యాధికి క్రియాత్మక, క్రియారహిత అనే రెండు దశలు ఉంటాయని తెలిపారు. క్రియాత్మక దశలో ఉన్న వారికి వైద్య చికిత్స అవసరం కాగా, క్రియారహిత దశలో ఉన్న వారికి శస్త్ర చికిత్స చేస్తే సాధారణ కంటి చూపును పునరుద్ధరించవచ్చని పేర్కొన్నారు. థైరాయిడ్ ఉన్న వారు క్రమబద్ధంగా కళ్లను పరీక్షించుకోవాలని సూచించారు. సాధారణంగా 30 నుంచి 50 ఏళ్ల వయసు స్త్రీలలో ఈ వ్యాధి ఎక్కువగా కనబడుతుందని తెలిపారు.

ఘనంగా విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు జివిఎంసి, నాలుగో వార్డు పరిధి తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ రెసిడెన్షియల్, డే క్యాంపస్ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం "అంకురన్-2023" పేరిట పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అమూల్యమైన సందేశాన్ని అందించారు. తొలుత విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పర్చువల్ పద్ధతిలో వీడియో సందేశాన్ని అందించారు. విద్యార్థులను ఆశీర్వదించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల సిఇఓ శ్రీకాంత్ మాట్లాడుతూ, దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం, కుటుంబ విలువల పెంపుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ప్రతి శనివారమూ "నో బుక్ డే" అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ చైతన్య వార్షిక నివేదికను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గతేడాది బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన, జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

మాట్లాడుతున్న జివిఎంసి అదనపు కమిషనర్ సన్యాసిరావు

కఠోర శ్రమ ద్వారానే ఉత్తమ ఫలితాలు

బాసర విద్యా సంస్థల చైర్మన్ రమేష్

సభలో మాట్లాడుతున్న చైర్మన్ పూడి రమేష్

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే ఏ రంగంలో నైనా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని స్థానిక బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ విద్యార్థులకు సూచించారు. శ్రీ బాసర జూనియర్ కళాశాల ఫెస్ట్ సెలబ్రేషన్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తిని అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవచ్చన్నారు. జోనల్ ప్రిన్సిపల్ వివిడి.రమేష్, డిఫెన్స్ కోచింగ్ విభాగాధిపతి కె.మహేశ్వరరెడ్డి, అడ్వైజరీ కమిటీ సభ్యులు డి.సత్యనారాయణరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఒకటో వార్డులో జెడ్‌సి పర్యటన

ప్రజాశక్తి- తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము శనివారం విస్తృతంగా పర్యటించారు. అలంక వారి వీధిలో పర్యటించిన ఆయన తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి క్లాప్ వాహనానికి అందివ్వాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒహెచ్ శంకరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, సచివాలయ సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇంజక్షన్ ద్వారా ఆడ దూడలు

ప్రజాశక్తి-ఆనందపురం : పాడిపశువులకు ఇంజక్షన్ ద్వారా ఆడ దూడల ఉత్పత్తి 90 శాతం ఖచ్చితత్వంతో పుట్టించవచ్చని ఎపిఎల్‌డిఎ సిఇఒ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించి ఇంజక్షన్ ద్వారా పుట్టే ఆడ దూడలను పరిశీలించారు. మండలంలో 90 పశువులకు ఎద ఇంజక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. బొడ్డపాలెంలో నాగేశ్వరరావు డెయిరీ ఫారమ్‌ను, వెల్లంకిలో విష్ణుకుమార్‌రాజు ఫారమ్‌ను సందర్శించారు. ఆడ దూడలను పుట్టించే ఇంజక్షన్లను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంజక్షన్‌పై రూ.850 సబ్సిడీని ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒ డి.శ్రీనివాస్, ఈవో డాక్టర్ రామ్మోహనరావు, పశువైద్యాధికారి లీలారాణి, గోపాలమిత్రులు పాల్గొన్నారు

క్లినిక్ ను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగప్రియ

మాతృశ్రీ హోమియో క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస శివాలయం వీధి మార్గంలో మాతృశ్రీ హోమియో క్లినిక్‌ను శనివారం ప్రారంభించారు. గత కొంత కాలంగా భీమిలి రోడ్డు, యూనియన్ బ్యాంక్, సంత పేట వద్ద నిర్వహించిన క్లినిక్‌ను సంగివలసకు మార్చారు. ఈ క్లినిక్‌ను సంబంధిత హోమియో వైద్యులు డాక్టర్ కెవై.నాగప్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రోజా, కల్యాణి

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం రాష్ట్ర మంత్రి ఆర్‌కె.రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఎఇఒ నరసింహరాజు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెంలో గ్రంథాలయ నిర్మాణానికి ఎంపిపి కంటుబోతు రాంబాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో యువకులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో భాగంగా గ్రంథాలయ నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ఈ నిధులతో పనులు పూర్తి కాకపోతే మళ్లీ మంజూరు చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం ఎమ్మెల్సీలకు నిధులు కేటాయించకపోవడంతో ఎటువంటి సహకారమూ అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

సూరిబాబు కుటుంబానికి పరామర్శ

ఉపాధ్యాయుడు కాళ్ల సూరిబాబు తల్లి కాళ్ల సింహాచలం శుక్రవారం మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని రఘువర్మ పరామర్శించారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ నల్లి సత్యవతి, మాజీ సర్పంచ్ నల్లి సన్యాసప్పడు, నాయకులు బి.సన్యాసినాయుడు, ఆర్.ముత్యాల నాయుడు, బోని చైతన్య, ఎంపిటిసి మాజీ సభ్యులు బి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సూరిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఎంపిపి రాంబాబు

ముగిసిన సాఫ్ట్ టిస్యూ లేజర్ వర్క్ షాప్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం దంత కళాశాల ఆసుపత్రిలో సాఫ్ట్ టిస్యూ లేజర్‌పై రెండు రోజులుగా జరుగుతున్న వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 136 మందికి పైగా దంత వైద్యులు హాజరయ్యారు. గీతం దంత కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా హాజరై దంత వైద్యంలో సాఫ్ట్ టిస్యూ లేజర్ ప్రాధాన్యతను వివరించారు. చెన్నైలోని రామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వైద్యులు డాక్టర్ వంశీ లావు, డాక్టర్ రామ శబరీష్, డాక్టర్ కిషోర్ హాజరై శిక్షణా అంశాలను వివరించారు. సాఫ్ట్ టిస్యూ లేజర్ విధానాన్ని వివరించడానికి 7 లేజర్ యూనిట్లను ఏర్పాటుచేశారు. వైద్యులకు ప్రత్యక్ష లేజర్ చికిత్స తెలుసుకునే ఏర్పాటుచేశారు.

విద్యార్థులను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి-పద్మనాభం : విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటే చదువు బాగుటుందని రాష్ట్ర బాలల హక్కుల చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని రేవిడి పంచాయతీ పరిధి అన్నంపేట ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఎస్ఒఎస్ ఆధ్వర్యాన సుమారు రూ.1.50 లక్షల విలువైన పుస్తకాలు, స్టేషనరీ, బ్యాగ్స్‌ను 200 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్ చూడకుండా తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో రేవిడి ఎంపిటిసి సభ్యులు ఎస్.సూరప్పడు, కోన రమణ, స్కూల్ హెచ్ఎం కె.కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుండె పనితీరు, స్కానింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో గుండె పనితీరు, స్కానింగ్ పద్ధతులపై శుక్ర వారం ప్రారంభమైన అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. పిజిఐ చండీగఢ్‌కు చెందిన బృందంలోని వైద్య నిపుణులచే అనేక అంశాలపై సదస్సు నిర్వహించారు. వైద్యులు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆసుపత్రి సహాయ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ సుజాత, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ విజయమారి ఉమా మహేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వైద్య కళాశాల ఉపాధ్యాయులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

సదస్సులో చండీగఢ్ వైద్య నిపుణులతో పీజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనధికార నిర్మాణాలకు నోటీసులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14, 25,26 వార్డుల్లో అనధికార నిర్మాణాలు చేపట్టిన యజమానులకు జివిఎంసి అధికారులు నోటీసులు ఇచ్చారు. 'యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు' శీర్షికన ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన కథనానికి జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పందించారు. ఆయా భవనాలను జివిఎంసి జోన్-3 టిపిఎస్ తేజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని భవనాలను నోటీసులిచ్చామని, మరికొన్నింటిని పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెంటయ్యరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -గాజువాక : ఉక్కు నిర్వాసిత సంఘ నాయకులు పాల పెంటయ్యరెడ్డి కోడలు వెంకటలక్ష్మి ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి శనివారం పరామర్శించారు. వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

ప్రజాశక్తి -ములగాడ : అవార్డులు బాధ్యతను పెంచుతాయని ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని మల్కాపురం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్‌కు అవార్డు వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. అంకితభావం, క్రమశిక్షణ, చిత్తశుద్ధి గల వారిని అవార్డులు వరిస్తాయన్నారు. సన్మాన గ్రహీత అజయ్‌కుమార్ మాట్లాడుతూ, అందరి సహకారంతో తాను విధులను నిర్వహిస్తున్నానని, తనకు అవార్డు రావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ప్రముఖ పాత్రికేయులు ఎస్.చలపతిరావు, రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకులు సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించారు. అనంతరం అజయ్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, స్థానిక ప్రజలు, పాత్రికేయమిత్రులు, ఇతర గ్రంథాలయ అధికారులు, సామాజిక సేవకులు, జాతీయ సేవా పథక కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజువాక తహశీల్దార్‌గా త్రినాధ్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ త్రినాధ్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పనిచేస్తున్న తహశీల్దార్ వి.సుజాత కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

50వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డు పరిధి ఉడాకాలనీ-2, మాధవధార, తెన్నేటినగర్ ప్రాంతంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ సంక్షేమం అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 30వ తేదీన ఉక్కునగరంలో త్రిష్ణ గ్రౌండ్‌లో చేపట్టే ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పలుచోట్ల ప్రచారాలు జరిగాయి.

ఉక్కునగరం : ఉక్కునగరం ఓబీసీ కార్యాలయంలో స్టీల్ ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు బి అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉక్కు ప్రజా గర్జనకు ఓబీసీ సభ్యులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్లాంట్ పరిరక్షణకు ఓబిసి అసోసియేషన్ గట్టిగా పనిచేయాలన్నారు. పోరాట కమిటీ చేపట్టే అన్ని కార్యక్రమాల్లో ఓబీసీ సభ్యులు యాక్టివ్‌గా పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉండవల్లి శ్రీనివాసరావు, ఆర్‌వి.నారాయణ, కొణతాల రామకృష్ణ, కారు దేముడు, గోవిందు, కోయిలాడ శ్రీనివాస్, వంగపండు తదితరులు పాల్గొని గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశమైన స్టీల్ ఒబిసి అసోసియేషన్ నాయకులు

అగనంపూడిలో మానవహారం

గాజువాక : ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ అగనంపూడిలో టిఎన్‌టియుసి నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజా గర్జనలో వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పూర్ణానందశర్మ పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతలను ఎదుర్కొనేందుకు

మార్క్స్ పెట్టుబడి గ్రంథం దోహదం

ప్రజాశక్తి-సీతమ్మధార : నేడు మానవాళి ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, అస్థిరత పెరుగుతున్న మానవ-ప్రకృతి పరస్పర చర్యల యొక్క నిలకడలేని సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మార్క్స్ పెట్టుబడి గ్రంథం ఉపయోగపడుతుందని ప్రముఖ ఆర్థిక శాస్త్ర ఆచార్య వకుళాభరణం వంశీ పేర్కొన్నారు. వై.విజయకుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అంశంపై శనివారం పౌర గ్రంథాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ-ప్రకృతి పరస్పర చర్యలు వంటి సమస్యలను కేవలం వ్యవస్థను సంస్కరించడం ద్వారా పరిష్కరించలేమన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. కార్ల్ మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకొనేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు సిహెచ్ రాఘవేంద్రరావు, సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, పలువురు వామపక్ష వాదులు, అభిమానులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో పంజాబ్ గవర్నర్

ప్రజాశక్తి-పెందుర్తి : విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహోత్సవాలలో పంజాబ్ గవర్నరు బన్వర్‌లాల్ పురోహిత్ శనివారం పాల్గొన్నారు. రాజశ్యామల అమ్మవారి విశిష్టత తెలుసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మేధా దక్షిణామూర్తి, దాసాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. టిటిడి నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనంలోను పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు శ్రీవారి ప్రసాదాన్ని పంజాబ్ గవర్నర్‌కు అందజేశారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

వేడుకగా రథసప్తమి

రథోత్సవంలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-యంత్రాంగం

రథసప్తమి వేడుకలను పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

సింహాచలం: సింహాచల దేవస్థానం ఆధ్వర్యాన కొండపైన హంసమూల వద్ద, కొండ దిగువన నూతన గోశాల వద్ద రథసప్తమి వేడుకలు నిర్వహించారు. కొండపైన హంసమూల వద్ద సింహాద్రి అప్పన్న సూర్యనారాయణ స్వామిగా సర్వాభరణాలతో అలంకరించి పలు పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేతునిగా హంసమూలపై అధిష్టింపచేసి స్వామి వారి నిత్య కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఇఇ నరసింహారాజు, శ్రీనివాసరాజు ట్రస్టు బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, శ్రీదేవి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి కొండ ప్రాంగణంలో ఉన్న కుంతీమాధవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన పురోహితులు సీతారామాంజనేయులు ఆలయ సంప్రదాయం ప్రకారం నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు దంపతులను స్వాగతించి స్వామి దర్శనానికి ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాలాడ పద్దు తదితరుల పాల్గొన్నారు.

ఆరిలోవ : పైనాపిల్ కాలనీ కొత్త గోశాల వద్ద గల సూర్యనారాయణ స్వామి విగ్రహం వద్ద సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ ప్రత్యే పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండితులు ఆదిత్య హృదయం పఠించారు. అనంతరం సూర్యనారాయణ స్వామి క్యాలెండర్‌ను లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవ్ టెంపుల్స్ ప్రతినిధి పిన్నమనేని శ్రీనివాస్, దాట్ల వర్మ పాల్గొన్నారు.

ములగాడ : రథసప్తమి సందర్భంగా మల్కాపురంలో వెంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు వేడుకలు టిడిపి 61వ వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్ ఆధ్వర్యాన నిర్వహించారు. సేవ గరిడి, స్వామి గరిడి, చిడతలుతో ఊరేగింపు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అనకాపల్లి : జివిఎంసి విలీన గ్రామం రాజుపాలెంశ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ముందుగా సూర్యనారాయణ స్వామి ఉత్సవ ఊరేగింపు మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రారంభించారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, డాక్టర్ జి రామ్మూర్తి, యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, జిల్లా జడ్జిలు గంగరాజు, ఫణికుమార్, మల్ల సురేంద్ర, పోలవరపు త్రినాథ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వీరిని దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేవరాపల్లి: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో సూర్యనారాయణమూర్తి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండలంలోని తిమిరం సూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయంలో ఆది దేవునికి భక్తులు ప్రణమిల్లారు. బోయల కింతాడ గ్రామంలో సర్పంచ్ బూరె బాబురావు దంపతులు ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి స్వామి చిత్రపటాలతో ఘనంగా ఊరేగింపు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తిశ్రద్ధలతో భక్తులు రథసప్తమి వేడుకలను నిర్వహించారు.

పురవీధుల్లో వెంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న స్థానికులు

ఫార్మా పరిశ్రమల్లో భద్రతా వైఫల్యాలపై ఆందోళన

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ, ధర్నా

సింహాద్రి స్టీల్ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ: ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు పోతున్న పరిస్థితుల్లో పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. శనివారం పరవాడ ఫార్మాసిటీ ముఖ ద్వారం సింహాద్రి స్టీల్ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ధర్నా నిర్వహించారు. ఫార్మా సిటీలో భద్రతా ప్రమాణాల పాటించాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, పరిశ్రమలపై నిర్వహించిన ఆడిట్ నివేదికలను ప్రమాదాలపై నిర్వహించిన విచారణ నివేదికలను వెంటనే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, ప్రమాదాలను యాజమాన్యాలు గోప్యంగా ఉంచడం సరికాదన్నారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు అమలుకు యాజమాన్యాలు కృషి చేయాలని, దీనిపై సంబంధిత అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. జిల్లాలో ఫార్మా పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నా జిల్లా పరిశ్రమల మంత్రి అమర్నాథ్‌కు బాధిత కుటుంబాలను పరామర్శించే తీరికగానీ, బాధిత కుటుంబాలను ఆదుకునే చొరవగానీ, యాజమాన్యాలతో సమావేశాలను నిర్వహించి, ప్రమాదాలపై హెచ్చరించే చిత్తశుద్ధిగానీ లేకపోవడం దుర్మార్గమన్నారు. దీన్నిబట్టి యాజమాన్యాలతో మంత్రి కుమ్మక్కయ్యారా అన్న అనుమానం కలుగుతోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అండదండలతోనే యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు గాలికొదిలేస్తున్నాయని మండిపడ్డారు. పరిశ్రమల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్మైలెక్స్, లారస్, సువెన్ పరిశ్రమల్లో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలకు సంబంధించి విచారణ నివేదికలను జిల్లా అధికారులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ అప్పారావు, ఎస్ నాగ అప్పారావు, దొడ్డి అప్పారావు, తాతారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిఐటియు సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ, దీనికి వ్యతిరేకంగా శనివారం అనకాపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. అనకాపల్లి పార్క్ సెంటర్లో సిఐటియు నాయకులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు చేపట్టిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, ఎ.బాలకృష్ణ, తెలయ్య బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్ లక్షలాదిమందికి ప్రత్యక్ష పరోక్షంగా ఉపాధి కల్పిస్తుందని, లాభాల్లో ఉన్న ఈ ప్రభుత్వరంగసంస్థ ప్రయివేటుకు ధారాదత్తం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చలపతి, రాజు, సురేష్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు శేష సాయి, కాంగ్రెసుల రఘు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

46 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కె. కోటపాడు : స్థానిక జెడ్‌పి హైస్కూల్ 1975-76 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కె.కోటపాడులో జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన ఆ బ్యాచ్ విద్యార్థులు 46 వసంతాలు తర్వాత కలిసి ఆనందంగా గడిపారు. రకరకాల ఉద్యోగాలు చేస్తూ రిటైరైన వారు, వివిధ వృత్తుల్లో పనిచేసినా, ఇపుడు శేష జీవితం గడుపుతున్న వారందరు తమ అనుభవాలను నెమరువేసుకుని ఆనందంగా చెప్పుకుంటూ మురిసిపోయారు. పదవతరగతిలో చదువుకున్న 46 మందిలో ఏడుగురు మృతి చెందగా, మిగిలిన వారందరు హాజరయ్యారు. ఉన్నంతలో ప్రతి ఏటా ఇలా కలుసుకుందామని నిర్ణయించారు. మాజీ జెడ్‌పిటిసి, ఎంపిటిసికసిరెడ్డి అప్పలనాయుడు. బండారు రాము, విశ్రాంత ఉపాధ్యాయులు పూడి శ్రీరామ్మూర్తి, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ చిన్నికృష్ణ సూచించారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయంలో పిసి అండ్ పిఎన్‌డిటి సమావేశంలో మాట్లాడుతూ, ఆడపిల్లల వల్లనే సమాజ వృద్ధి చెందుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి పట్టుబడితే మొదటిసారి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తారన్నారు. రెండో తప్పునకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానాతో పాటు వైద్య ధ్రువీకరణ పత్రం రద్దు చేస్తారన్నారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులే అన్నారు. అనకాపల్లి డివిజన్లో 37 అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, లింగ నిర్ధారణ పరీక్ష ద్వారా ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించినట్టు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 102, 104 నంబర్లకు తెలియజేయాలన్నారు. ఎఎన్ఎం. ఆశాలు గృహ సందర్శన ద్వారా ఆడపిల్లల ప్రాముఖ్యతను అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిపి వి.రాజరాజేశ్వరి, వైద్య విధాన పరిషత్ డాక్టర్ విజయశంకర్, డిఎంఇఒ. యూన్సీ రాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్నపూర్ణ, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో మాడుగుల టిడిపి నేతలు

పాదయాత్రలో పాల్గొన్న మాడుగుల టిడిపి నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : కుప్పంలో టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో మాడుగుల నియోజకవర్గ టిడిపి నేతలు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజికుమార్, పైలా ప్రసాదరావులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. రానున్నసార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ యువగళం పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. వీరి వెంట అధిక సంఖ్యలో మాడుగుల నియోజకవర్గ టిడిపి శ్రేణులు పాదయాత్రలో పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

30న విజయవాడలో సమన్వయకమిటీ సదస్సు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 30న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ చేతివత్తిదారుల సమన్వయ కమిటీ సదస్సు విజయవంతం చేయాలని కమిటీ జిల్లా కన్వీనర్ గంట శ్రీరామ్, ఎపి గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా అధ్యక్షులు పురుగుటి శివ సూర్యనారాయణ, ఎపి మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి చొడపల్లి గంగరాజు, సిహెచ్ శివాజీ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలోని 56 కార్పొరేషన్లకు నిధులు నిర్ణయించి. నిధులు కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారంలోకి వస్తే ఒక్కో ఫెడరేషన్‌కు రూ.వెయ్యికోట్లు కేటాయిస్తామన్న హామీని సిఎం జగన్ నెరవేర్చాలన్నారు. ప్రతి వత్తిదారునికి కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేల ఆర్థిక సహకారం అందించాలని, 200 యూనిట్లులోపు విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన వృత్తిదారుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, మత్స్యకారుల జీవితాలను ధ్వంసం చేసే జిఒ 217 రద్దు చేయాలని, 343 జిఒ ప్రకారం స్థానిక చేతివత్తిదారుల సొసైటీలకు నామమాత్రపు ఫీజుకు పంచాయతీ చెరువులు ఇవ్వాలన్నారు. చేపల వేట నిషేధ సమయంలో వృత్తి పరిహారాన్ని రూ.20 వేలకు పెంచాలని, చేనేత పై జిఎస్‌టి రద్దు చేయాలని, రజకులకు చెరువులు దోబీ ఘాట్ల పై హక్కులు కల్పించాలని, జగనన్న చేదోడు చేతి వృత్తిదారులు అందరికీ ఇవ్వాలని, జిఒ27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని, కల్లుగీత కార్పొరేషన్ పునరుద్ధరించి, రాష్ట్ర బడ్జెట్లో వీరికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని, ఈఎంఐ లేకుండా వడ్డెర వృత్తిదారులకు ఐదు లక్షల వరకు కాంట్రాక్టర్లు ఇవ్వాలని కోరారు. డిమాండ్ల సాధనకు చేపట్టే భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులపై ఎంపిపి సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, సచివాలయాలు, రోడ్లు డ్రైనేజీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి గొర్లి సూరిబాబు మండల అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ధర్మారావు అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. అధికారులు సమన్వయంతో సమస్యలన్నింటినీ పరిష్కరించాలని సూరిబాబు సూచించారు. సమావేశంలో వైసిపి నాయకులు పెద్దాడ రామ శంకర్, మంత్రి సత్తిబాబు, ఆర్డబ్ల్యుఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్, అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- చోడవరం : మండలంలోని కన్నంపాలెం గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన విగ్రహాన్ని వేద పండితుల సమక్షంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పూజలు నిర్వహించి, ఆవిష్కరించారు.వైస్ ఎంపిపి బైన కుమారిఈశ్వరరావు, ఒరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

ఘనంగా తీర్థం

ప్రజాశక్తి- కశింకోట: మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో శనివారం ఆంజనేయ స్వామి తీర్థం ఘనంగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ చైర్మన్ నారిపిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

నిలిచిన క్రషింగ్.. ఆగిన చెరుకు సరఫరా!

కాటాల వద్ద ఎండిపోతున్న వైనం
ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : గోవాడ చక్కెర కర్మాగారం క్రషింగ్‌లో తరచూ మరమ్మత్తులతో కాటాల వద్ద రైతులు సరఫరా చేసిన చెరుకు రవాణా జరగక ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చయ్యపేట చెరుకు కాటాకు వారం రోజుల క్రితం రైతులు సరఫరా చేసిన చెరకు నేటికీ రవాణా జరగక నేటికీ కాటా యార్డులోనే ఉండిపోవడంతో ఎండి పాడౌతోందని వాపోతున్నారు. బుచ్చయ్యపేట చెరుకు కాటాకు బుచ్చయ్య పేట, ఐతంపూడి, కందిపూడి, కోవెలపల్లి, కేపీ అగ్రహారం, కొండపాలెం, దిబ్బిడి, గొన్నవానిపాలెం తదితర గ్రామాల నుండి చెరుకు రవాణా జరుగుతుందన్నారు. అయితే వారం రోజుల క్రితం బుచ్చయ్యపేట కాటాకు రైతులు తీసుకొచ్చిన చెరుకు నేటికీ కూడా గోవాడ చక్కెర కర్మాగారానికి లోడింగ్ కాలేదు. దీంతో కాటా వద్ద ఎండిపోతూ, తూకంలో తేడా వచ్చి రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని అంటున్నారు. అంతేకాక ఒక్కోసారి పదేసి రోజులపాటు కాటాయార్డులోనే చెరుకు ఉండిపోతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంతేకాక బుచ్చెయ్యపేట కాటాకు సమీప గ్రామాల నుంచి ట్రైరు బళ్ళు, ట్రాక్టర్లు, ట్రక్కులపై తీసుకొచ్చిన చెరకు సరఫరా కాని పరిస్థితుల్లో వారం పదిరోజులపాటు వాటిపైనే ఉండిపోతుం డడంతో వాటి అద్దె భారం రైతులకు తడిసిమోపెడు అవుతోందని అంటున్నారు. దీంతోపాటు వారంరోజుల పాటు చెరుకును దించే పరిస్థితి లేకపోవడంతో కాటాలకు చెరకు తరలింపునకు బళ్లుగానీ, వాహనాలు గానీ రావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా గోవాడ సుగర్స్ యాజమాన్యం స్పందించి, కాటాల వద్ద చెరకు రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని, చెరుకు రోజుల తరబడి నిల్వ ఉండకుండా వెంటనే ఫ్యాక్టరీలకు తీసుకెళ్లేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

బుచ్చయ్యపేట కాటాలో నిలిచిపోయిన చెరుకు

90వ రోజుకు నాబ్ నిర్వాసితుల ఆందోళన

నినాదాలు చేస్తున్న మత్స్యకార జెఎసి నేతలు, ప్రజలు

ప్రజాశక్తి రాంబిల్లి : సమస్యల పరిష్కారానికి మత్స్యకార జెఎసి ఆధ్వర్యంలో నేవీ నిర్వాసితులు నేవీ మెయిన్ గేటు వద్ద చేపడుతున్న ఆందోళన శనివారం 90వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ, మూడు నెలలుగా ఆందోళన కొనసాగిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమని నేవీ నిర్వాసితులు ఆందోళన చెందారు. ఎనిమిది గ్రామాలు నిర్వాసితులు ఇన్నాళ్లుగా ఎందుకు ఆందోళన చేస్తున్నారో, సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అటు ప్రజాప్రతినిధులకుగానీ, ఇటు అధికారులకు గానీ కనీసం చొరవ లేకపోవడం సరికాదన్నారు. తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని, అలాగూ శారదానదిలో వేటకు వెళ్లే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

దర్గా ఉత్సవాల్లో బర్కత్ ఆలీ

ప్రజాశక్తి -కంచరపాలెం : అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో కార్పొరేటర్ బర్కత్ ఆలీ మొక్కులు చెల్లించుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మొక్కుబడి చెల్లించుటకు ప్రభుత్వం తరపున వెళ్లిన కమిటీ సభ్యులలో బర్కత్ ఆలీ ఉన్నారు. దేశంలోని ప్రజలు ఏటువంటి వైరస్‌ల బారిన పడకుండా, ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు బర్కత్ ఆలీ తెలిపారు.

త్రినాధపురంలో ఎన్‌టిఆర్ శతజయంతి

ప్రజాశక్తి -ములగాడ : తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలలో భాగంగా శనివారం త్రినాధపురంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహారం ఏర్పాటుచేశారు. టిడిపి వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 62వ వార్డు టిడిపి ప్రధానకార్యదర్శి నీలంరాజు, సీనియర్ నాయకులు దొప్ప సన్యాసిరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, బూత్ కన్వీనర్లు సేనాపతిరాము, అరిగా రాజు, ముత్యాలనాయుడు, నాయకులు నీలాపు జోగి, రాజమణి, త్రినాధ్, హరి, శ్రీధర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జలజీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్ ఒకటో వార్డులో జలజీవన్ మిషన్ కింద మంచినీటి పైపులైన్ పనులు శనివారం జరిగాయి. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు పైపులైన్ ఏరాపటు చేస్తున్నారు. పనులను ఎంపిటిసి లగిశెట్టి భవానీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్ స్థానికలు పాల్గొన్నారు

మత్స్యకారులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పరవాడ: మత్స్యకారులు పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యధోరణి సరికాదనిఅనకాపల్లి జిల్లా ఒబిసి కో ఆర్డినేటర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఆర్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని ముత్యాలపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తోందని, కార్పొరేషన్ పెట్టినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని దుయ్యబట్టారు. మత్స్యకారులకు వెంటనే కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అప్పలరాజు, దేముడు, మెసేను, తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.

ఏకలవ్య గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని పెదముషిడివాడ పంచాయతీ, గండివానిపాలెం గ్రామంలో ఏకలవ్య గ్రంథాలయాన్నిశనివారంసర్పంచ్ పల్లా అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో కలవలపల్లి సత్యనారాయణ, వైసిపి కన్వీనర్ నందవరపు శ్రీను, గ్రామ పెద్దలు కరణం చిన్నారావు, మాటూరి అర్జునరావు, వార్డు సభ్యులు బొబ్బరి శ్రీను, యాదల్ల రాజు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యం

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి-సబ్బవరం : రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. శనివారం సబ్బవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అరాచక, నిరంకుశ పాలన పట్ల రాష్ట్ర ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. యువగళం పేరిట లోకేష్ చేస్తున్న పాదయాత్రకు తొలిరోజు విశేష స్పందన చూసి, వైసిపి నేతల్లో గుబులు మొదలైందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం పురోభివృద్ధి చెందాలంటే సమర్థవంతమైన చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి వల్లే సాధ్యమని ప్రజల్లో స్పష్టమైన భావన నెలకొంటోందన్నారు. దాన్ని ఓట్లుగా మలిచేందుకు, వచ్చే ఎన్నికల్లో టిడిపి అఖండ విజయానికి పార్టీ శ్రేణులు, ముఖ్యంగా కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పెందుర్తిలో టిడిపి అఖండ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మండల మిడతాడ మహాలక్ష్మినాయుడు, గండి రవి, గండి ముత్యాలనాయుడు, బరినికాన బాబూరావు, కోటాన అప్పారావు, గండి దేముడుబాబు, స్థానిక సర్పంచ్ డి.ప్రసాదరావు ,బోండా సత్యారావు, కోరాడ శ్రీనివాసరావు, దొడ్డి ప్రకాశరావు, రేసుపూడి రమణ, పల్ల తాతారావు, ఆకుల గణేష్, గవర అప్పారావు, రొంగలి దేముడు, పడాల వెంకట రమణ, దాడి కన్నం నాయుడు, అక్కు బాబు, బలిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

1ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ప్రసిద్ధిగాంచిన గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించింది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి, ఎం శ్రీనివాసరావు, పొలమరశెట్టి మురళి, మళ్ల బుల్లిబాబు పాల్గొన్నారు. నూకాంబిక అమ్మవారికి దేవస్థానం తరుపున దాడి జయవీర్, ఈవో చంద్రశేఖర్ పట్టు వస్త్రాలను బహూకరించారు. వీరికి ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కొణతాల మురళి కృష్ణ, కొణతాల మహాలక్ష్మి నాయుడు, పివి రమణ, కృష్ణంరాజు ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరేగింపును ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు, నేతలు

యుజిడి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మునగపాక రూరల్: మండలంలోని మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేట గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యుజిడి) పనులు స్థానిక సర్పంచ్ భీశెట్టి గంగఅప్పలనాయుడు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర, కార్యదర్శి శ్రీదేవి శనివారం శంకుస్థాపన చేశారు. . ఈ సందర్భంగా సర్పంచ్ గంగ అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాభివృద్దే లక్ష్యంగా ప్రాధాన్యతాక్రమంలో అనిన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాము, గ్రామ పెద్దలు ఆడారి శ్రీనివాసరావు, సమ్మెంగ భాస్కరరావు, పాల్గొన్నారు.

నాగాభరణం బహూకరణ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి స్థానిక కంచర్ల వర్కర్ అలమండ చిట్టిబాబు నాగాభరణం బహూకరించారు. రూ.పదివేలు విలువచేసే నాగాభరణాన్ని రథసప్తమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శరగడం జగ్గారావుకు అందజేశారు. దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివలింగానికి అమర్చారు. ఇత్తడి, వెండి, రాగి తదితర పంచలోహాలతో అనేక విగ్రహాలు తయారీలో సుప్రసిద్ధులైన దాత అలమండ చిట్టిబాబును స్థానిక పెద్దలు అభినందించారు

సత్యనారాయణకు రాష్ట్రపతి అవార్డు

రాష్ట్రపతి మెడల్ స్వీకరిస్తున్న హెడ్ వార్డర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో విధులు నిర్వహిస్తున్న జైలు హెడ్ వార్డర్ సంపతిరావు సత్యనారాయణకు గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మంగళగిరిలో రాష్ట్ర జైళ్ళ శాఖ డిజి మహ్మద్ హసన్ రెజా ద్వారా రాష్ట్రపతి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ప్రోత్సహించిన కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్‌కు, విధి నిర్వహణలో తనకు అన్ని వేళలా సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు, తోటి ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరసింహారెడ్డి విజయోత్సవం

ప్రజాశక్తి -ములగాడ : గాజువాక స్టీల్ సిటీ నందమూరి ఫ్యాన్స్ అధ్యక్షులు నమ్మి గౌరీశ్వరరావు ఆధ్వర్యాన వీర సింహారెడ్డి విజయోత్సవాన్ని గోకుల యాదవ సామాజిక భవనంలో శనివారం నిర్వహించారు. విజయోత్సవ కేక్ కటింగ్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు పుర్రి సురేష్‌యాదవ్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, చైర్మన్ పిల్ల శంకరరావు మాట్లాడుతూ, అభిమాన సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సంక్రాంతి సినిమాలలో అత్యధిక కలెక్షన్లు సాధించి నందమూరి బాలకృష్ణ విజేతగా నిలిచారని అభిమానులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాన్స్ ఆర్గనైజర్ ప్రసాద్‌శర్మ, ఉరుకూటి ఎల్లాజీ, సిహెచ్.ఈశ్వరరావు, లోపింటి రమణ, ఎస్.సూర్య, ఎదురు శ్రీను, ఆర్.అప్పలరాజు, వి.గోపీయాదవ్, బి.చిన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అవరోధంగా టిడిపి నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : వాలాబు పంచాయతీ శివారు గ్రామాల అభివృద్ధికి మాడుగుల టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు అడ్డంకిగా మారారని స్థానిక వైసిపి నాయకులు పోడెల అన్నపూర్ణ, నానిబాబుతో సహా పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రైవాడ అతిథి గృహం వద్ద వివిధ గిరిజన గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ, గడపగడపకూ పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చర్యలు చేపడుతుంటే, టిడిపి నేతలు అభివృద్ధిని అడ్డుకునేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తగు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో గరిసింగి, తామరబ్బ, చింతలపూడి సర్పంచులు గుండెపు రాము, టోకూరి రామకృష్ణ, దొమ్మంగి బోడమ్మ, ఎంపిటిసి కోలా వెంకటరమణ (గోపీ) ఉప సర్పంచులు గంగరాజు, లక్ష్మి మహేష్ పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుడు

వెంకటేష్‌కు కలెక్టర్ అభినందనలు

-స్వయంగా ఇంటికి వచ్చి కళాఖండాలు, సర్టిఫికెట్లు పరిశీలన- ఆనందంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ నివాసానికి శనివారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి రావడంతో అతనితో పాటు తల్లిదండ్రులు సూరిబాబు, సత్యవతిలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సూక్ష్మ కళాకారుడు వెంకటేష్‌తో 20 నిమిషాల పాటు మాట్లాడారు. వెంకటేష్‌కు వచ్చిన పురస్కారాలు, సర్టిఫికెట్లు, అవార్డులు, పెన్సిలు ముళ్ళుతో తయారు చేసిన టూత్ స్టిక్స్, ఈఫిల్ టవర్, అగ్గిపుల్లలు, పగిలిపోయిన గాజు పెంకులను ఉపయోగించి తన సూక్ష్మ కళతో ఆయన తయారు చేసిన అనేక కళాకృతులను కలెక్టర్ పరిశీలించి వెంకటేష్‌ను అభినందించారు. వెంకటేష్ ఆర్ట్స్ పేరుతో ప్రత్యేకంగా తయారు చేసిన కళాఖండాల ఆల్బమ్ కలెక్టర్ పరిశీలించి అభినందించారు. తెలుగు సహా అనేక ఆంగ్ల పత్రికల్లో తన గురించి ప్రచురితమైన కథనాలను కలెక్టర్ కు చూపించారు. ఇదిలా ఉండగా వెంకటేష్ గీతం వర్సిటీలో ఆర్కిటెక్ విభాగంలో ఇంజనీరింగ్ చదివాడు. 13ఏళ్ల పాటు ఎన్నో అద్భుత కళాఖండాలు సృష్టించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు తనకు ఇష్టమైన కళలో విశేష ప్రావీణ్యం పెంచుకున్నాడు. ఫలితంగా 500 వరకూ కళాఖండాలను తయారు చేశాడు. పెన్సిల్ ముల్లుపై అనేక అద్భుత కళాకారులను ఆవిష్కరించాడు. ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్నాడు. గతంలో రాష్ట్రపతి ప్రణవ్ ముఖర్జీతో కూడా అభినందనలు పొందాడు. వెంకటేష్ రూపొందించిన అద్భుత సూక్ష్మ కళ ఖండాలను పరిశీలించిన అనేక సంస్థలు వెంకటేష్‌కు ప్రశంసా సర్టిఫికెట్లు ,బహుమతులను అందజేశాయి. ఈ మేరకు వెంకటేష్ కళా నైపుణ్యత, ప్రతిభను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వచ్చారు.

ప్రశంసా పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్

బాధితులను పరామర్శిస్తున్న కృష్ణ స్వరూప్

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉద్దండపురంలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. శనివారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 4న గ్రామానికి చెందిన అగ్రకులం వారు దళితుల పట్ల అవమానంగా మాట్లాడి, దాడికి పాల్పడినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు దాడి చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, న్యాయ పోరాటం చేస్తామని తెలపారు. ఈ సమస్యను డిజిపి, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఇటువంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగుపల్లి భాస్కర్, మారుతి సింహాచలం, బోడపాటి సురేష్, దువ్వాడ దావీదు పాల్గొన్నారు.

నగదు ఇస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని కోణం పంచాయతీ శివారు జాజులపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పట్నం రామారావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ ఎర్ర అప్పారావు, నాయకులు లాలం జానకిరామ్, కురచా నారాయణమూర్తి, కిమిడి సన్యాసిరావు, మట్ట బాబూరావులు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆర్థిక సహాయంతో రూ.5 వేలను మతుని కుమారుడికి అందించారు. ప్రభుత్వపరంగా వచ్చే రాయితీలను ఆ కుటుంబానికి అందే విధంగా చూస్తామని నేతలు హామీ ఇచ్చారు.

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అన్నీ అబద్దాలు చెప్పించారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. శనివారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం గవర్నర్ ప్రసంగంలో గత సంవత్సర కాలంలో చేసిన పనులు, చేయబోయే కార్యక్రమాలు వివరించడం ఆనవాయితీ అన్నారు. ఏమీ చేయకపోయినా చేసినట్లు గవర్నర్‌తో చెప్పించారన్నారు. ముఖ్యంగా విద్యా విధానం గత మూడున్నర సంవత్సరాల కాలంలో 30వేల పాఠశాలలు మూసివేశారన్నారు. ఈ విషయం గవర్నర్‌కి తెలియదా అని ప్రశ్నించారు. రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర లేక కొనేవాడు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని, సుగర్ ఫ్యాక్టరీలు మూసివేశారని తెలిపారు. ఆసుపత్రుల్లో డాక్టర్స్ లేరన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో జనరేటర్లకు డీజిల్ కొట్టేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉందన్నారు. రహదారులు అధ్వాన్నంగా ఉన్నా గవర్నర్ తన ప్రసంగంలో 5181 కిలోమీటర్లు రోడ్లు వేశామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తానని చెబుతున్నారని, తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో 80 శాతం పూర్తి చేసిన పనులు నేటికీ కనీసం 5 శాతం పనులు కూడా చేయలేదన్నారు. మరి ఏ విధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. 25 లక్షలు ఇళ్లు కడతానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి కనీసం 25 వేలు కూడా కట్టలేదని తెలిపారు. లక్షా 80వేలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు మాత్రమే ఇస్తున్నారన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఎక్కడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా దారి మళ్లించిందని విమర్శించారు.

ఆనంద్ కుమార్‌ను సత్కరిస్తున్న కొండబాబు, తదితరులు

ఆనంద్ కుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:విశాఖ డెయిరీ ఛైర్మన్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆడారి ఆనంద్ కుమార్‌ను శనివారం డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపమాక పాల సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, మీగడ సత్యనారాయణ, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, వెలగా శ్రీనివాసరావు, తోలేటి శ్రీనివాస్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి, వెంకన్న జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రచారం చేపడుతున్న నాయకులు

30న బహుజన చైతన్య సభ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:నర్సీపట్నం సిబిఎం కాంపౌండ్ వద్ద ఈనెల 30న జరిగే బహుజన చైతన్య సభను జయప్రదం చేయాలని బిఎస్పీ జిల్లా ఇన్చార్జ్ బొట్టా నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సభకు సంబంధించి ప్రచారాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న బహుజన రాజ్యాధికార యాత్ర నర్సీపట్నం ఈనెల 30న వస్తున్న నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బహుజనులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ బహుజన వాది పెద కుమార్ బాబు మాస్టారు ఈ ఆటో ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధర్, అప్పలనాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట:జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకులు చిట్టాల రామారావు జన్మదిన వేడుకలు శనివారం పాయకరావుపేట పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని స్థానిక నాయకులు రామారావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మండలంలోని పెంటకోట గ్రామంలో ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రామారావు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

పశుపోషణపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:శాస్త్రీయ పశుపోషణలో అవగాహన పెంపొందించేందుకు శనివారం మండలంలోని కొండపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పశువిజ్ఞాన బడిని పశువైద్యాధికారి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ, పాల కేంద్రంనకు తీసుకెళ్లే వరకు పాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇతర పశుసంవర్ధక పథకాలు సద్వినియోగం చేసుకొని లాభదాయకమైన పశుపోషణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు భానుబాబు, కుమార్‌లు పరిశుభ్ర పాల ఉత్పత్తి రైతుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ యశోద, సిబ్బంది శ్రీనివాస్, శివ, వల్లిక రాజు, పాడి రైతులు రమణ, నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవ ముగింపు సందర్భంగా సర్పంచ్ లింగన్న నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా అమ్మవారి సారెను ఊరేగించారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గడిచిన రెండు రోజులుగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు శనివారం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెదపూడి లోవరాజు, టిడిపి నాయకులు రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు పెట్ల నరేష్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న సారె

రోలుగుంట:
నిండుగొండలో శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శెట్టి శోభ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 29న సాయంత్రం స్టేజి, ఆర్కెస్ట్రా తదితర ప్రోగ్రాంలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం గౌరీపరమేశ్వరుల నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

పరామర్శిస్తున్న బూడి ముత్యాలనాయుడు

వైస్ ఎంపిపికి బూడి పరామర్శ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వైస్ ఎంపీపీ దత్తుడు రాజు సతీమణి వరలక్ష్మి ఇటీవల మరణించడంతో శనివారం మంత్రి బూడి ముత్యాల నాయుడు శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - చీడికాడ :మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో ఈనెల 29న ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు హాజరు కానున్నారు. వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మండల కన్వీనర్ రాజబాబు కోరారు.

రోడ్ల మరమ్మతుకు జనసేన దీక్ష

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :నియోజవర్గంలో పాడైన ప్రధాన రోడ్లను బాగు చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజన్న వీర సూర్య చంద్ర స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద శనివారం నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొలుగొండ మండలం చీడిగుమ్మల, యర్రవరం నుంచి అరిలోవ అటవీ ప్రాంతం, నాతవర,. తాండవ రోడ్డు మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం ఆరిలోవ ప్రాంతంలో రోడ్డు అధ్వాన్నంగా ఉందని, తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి సమయాల్లో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఎమ్మెల్యే గణేష్ రోడ్డు అభివృద్ధికి కృషి చేయడం లేదని విమర్శించారు. అటవీశాఖ అనుమతులు ఇచ్చినప్పటికీ ఆర్అండ్‌బి శాఖ నుంచి రూ.40లక్షలు తీసుకు రావడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, ప్రోగ్రామ్ కమిటీ మెంబర్లు కొత్తకోట రామశేఖర్, పెనుపోతుల నాగు, మారిశెట్టి రాజా, చిరంజీవి శ్రీను, లంక పాత్రుడు పాల్గొన్నారు.

దీక్షను చేపడుతున్న నేతలు

స్టడీ మెటీరియన్‌ను ఇస్తున్న హెచ్‌ఎం, నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని పి.కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ బాపనమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు గండి నానాజీ మాట్లాడుతూ, బాపనమ్మ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు బుక్స్, పెన్నులు, జామెంట్రీ బాక్స్, అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగలి రాంప్రసాద్, వైసీపీ యువజన నాయకులు జాగారపు శ్రీనివాస్, రోంగలి భాస్కర్, లాలం రమణ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు ఆచూకీ కోసం ఎదురుచూపు

క్లీనర్ పని నిమిత్తం కొల్‌కతా వెళ్లి అదృశ్యం
కొత్తకోట పోలీసులకు కుటుంబీకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-కొత్తకోట:ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు నెల రోజులుగా కానరాక పోవడంతో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉంది. పది రోజుల పాటు క్లినర్‌గా వెళ్లి సంపాదించుకు వస్తానని చెప్పి వెళ్లిన కొడుకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తాలో ఆచూకీ కనబడకుండా పోవడంతో ఆ వృద్ధ తల్లిదండ్రులు, అతని భార్య, పిల్లలు తల్లడిల్లుతున్న సంఘటన రావికమతం మండలం కొత్తకోటలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాయి సుబ్రహ్మణ్యం (30) గ్రామంలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సొంత ఇల్లు కుడా లేని సుబ్రహ్మణ్యం కుటుంబంలో సరిగా కళ్ళు కనపడని తండ్రి రాయి రమణ (66), కాలు సక్రమంగా లేని వృద్దురాలైన తల్లి రాజుతో పాటు భార్య కళ్యాణి, మరో ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన ఐసర్ వేన్ యజమాని గట్టా శ్రీనుతో కలిసి డిసెంబర్ 29న క్లినర్‌గా పని చేసేందుకు ఒప్పందం పై వెళ్ళాడు. యానాంలో గాజువాక ఏరియా గంట్యాడకు చెందిన శంకర్ అనే మరో వేన్ యజమానితో కలిసి రెండు వాహనాలతో యానాం నుంచి అసోమ్ రాష్ట్రానికి పైపులు లోడ్‌తో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోల్‌కత్తాలో రిటన్ లోడ్ కోసం జనవరి 7,8 తేదీల్లో ఆగారు. లోడ్ తొందరగా దొరక పోవడంతో అక్కడే ఉన్నారు. ఈ ముగ్గురులో సుబ్రహ్మణ్యం 8న రాత్రి ఆకస్మికంగా అదృశ్యం అయ్యాడు. అప్పటి వరకూ శ్రీను, శంకర్‌లతో కలిలసి ఉన్న సుబ్రహ్మణ్యం అదృశ్యం కావడంతో రెండు రోజులు పాటు వెతికారు. ఆచూకీ లేక పోవడంతో వెనుతిరిగారు. వెంటనే సమాచారం ఇవ్వకుండా సుబ్రహ్మణ్యం కనపడలేదని యువకుని కుటుంబ సభ్యలకు జనవరి 16న చెప్పారు. దీంతో కలత చెందిన తల్లిదండ్రులు, భార్య కళ్యాణి కొత్తకోట పోలీసులను ఆశ్రయించి జనవరి 17న ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్తకోట ఎస్ఐ విభూషణరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. డ్రైవర్ శ్రీనును మరో మారు కోల్ కతాలో ఆచూకీ తెలుసు కోవాలని పంపారు.తమ కుమారుడు సుబ్రహ్మణ్యంను పనికి వెంట తీసుకు వెళ్లిన శ్రీను నిర్లక్ష్యం గాను, పొంతన లేని సమాధానం చెబుతున్నాడని తల్లిదండ్రులు, భార్య కళ్యాణి ఆరోపిస్తున్నారు. ఈ నెల 8 న అదృశ్యం అయితే 16న సమాచారం ఇచ్చాడని దీని వెనక ఏదో అనుమానం ఉందన్నారు. తన దగ్గర నుంచి కాకుండా మరో డ్రైవర్ శంకర్ వద్ద నుంచి అదృశ్యం అయినట్టు చెబుతున్నాడని తనతో వెళ్లిన యువకుడు అదృశ్యం అయితే తనకు సంబంధం లేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు శాఖ, ప్రభుత్వం చొరవ తీసుకుని తమ కుమారుడి ఆచూకీ తెలుసు కోవాలని కోరుతున్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు (ఇన్‌సెట్‌లో సుబ్రహ్మణ్యం)

ఎంపీల ఇంట పెళ్లి సందడి



ఎంపీలు సత్యవతి, ఎంవివి కుమారుల వివాహానికి హాజరైన మంత్రి అమర్‌నాథ్, తదితరులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ బివి.సత్యవతి ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుమారుడు శరత్ చౌదరి వివాహం శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరులోని లీలా భారతీయ సిటీలో జ్ఞానితతో ఘనంగా జరిగింది. అనంతరం ఈ వివాహానికి సంబంధించిన రిసెప్షన్‌ను శనివారం సాయంత్రం ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. పలువురు నేతలు, అధికారులు, ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి కుమారుడు డాక్టర్ యశ్వంత్ వివాహం డాక్టర్ లీలా స్రవంతితో జరిగింది. ఈ వేడుకకు స్థానిక సాగరమాల కన్వెన్షన్ హాల్ వేదికైంది. ఈ రెండు వివాహాలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై ఆశీర్వదించారు.

డిపిఓ దృష్టికి మురుగు నీటి సమస్య

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో పెద్ద వీధిలో నెలకొన్న మురుగు నీటి సమస్య పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరిషా రాణిని గ్రామస్తులు కోరారు. గత ఏడు సంవత్సరాల నుండి పెద్ద వీధిలో డ్రైనేజీ నిర్మాణాలకు ఆటంకం ఏర్పడటంతో మురుగు నీరు పోవడానికి అవకాశం లేకుండా పోయిందని, దీంతో రోడ్డుపై ఉండి పోతుందన్నారు. చాలాకాలం నుండి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, దీంతో దోమలు ప్రబలి, రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని డిపిఓను ఆదేశించడంతో ఆమె శనివారం సమస్యను నేరుగా పరిశీలించారు. పెద్ద వీధిలో నివాసం ఉంటున్న వారంతా సమస్యను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పెద్ద వీధిలో జిరాయతీ భూములు ఉన్న వారు 9 అడుగుల స్థలం వదిలి ఇల్లులు నిర్మించుకోకుండా గ్రామ కంఠం స్థలం అక్రమించారని, సర్వే చేసి పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని సర్వేయర్‌ను ఆదేశించారు. అక్రమంగా గ్రామకంఠంలో నిర్మించుకున్న ఇల్లులను తొలగించాలని వెంకటనారాయణ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను ఆదేశించారు.

డిపిఓకు సమస్యను చెపుతున్న గ్రామస్తులు

ప్రారంభిస్తున్న జీవన్‌రాయ్

వసతి గృహం ప్రారంభం

ప్రజాశక్తి -మాకవరపాలెం:మండలంలో కొండల ఆగ్రహారంలో ఇమ్మాన్యుయేలు సంస్థ ఆధ్వర్యాన నర్సింగ్ విద్యార్థులకు కొత్తగా నిర్మించిన నూతన వసతి గృహాన్ని శనివారం జర్మనీ దేశస్తులతో పాటు సంస్థ అధినేత జీవన్‌రాయ్ ప్రారంభించారు. అనంతరం జీవన్ రాయ్ మాట్లాడుతూ, నర్సింగ్ విద్యార్థులు 160 మంది ఉండేటట్లు వసతి గృహం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీంతో నర్సింగ్ విద్యార్థులకు వసతి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల పున:ప్రారంభం

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని సిహెచ్ నాగాపురం పంచాయతీ కుమారపురం గ్రామంలో మండల పరిషత్ పాఠశాలను సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపిపి గజ్జలపు మణికుమారి చేతుల మీదుగా పాఠశాలను పున:ప్రారంభించారు. సుమారుగా ఎనిమిది సంవత్సరాల క్రితం మూసివేసిన పాఠశాల తిరిగి సర్పంచ్ కృషితో మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, ఎంపిపి మణికుమారి చొరవతో పున:ప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలను ప్రారంభిస్తున్నచైర్మన్, ఎంపిపి